క్లుప్తంగా

29 నుంచి కంబాలపల్లి ఉరుసు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ముజావర్ బాదర్లసాహెబ్

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో వెలసిన మస్తాన్ వలి ఉరుసు మహోత్సవం ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని ముజావర్ షేక్ బాదుల్లా సాహెబ్ ఆదివారం తెలిపారు. 29న రాత్రి గంధోత్సవం, మార్చి 1న ఉరుసు, 2న జియారత్, భక్తాగ్రేసరులకు కమిటీ వారితో కలిసి తీర్థ ప్రసాదముల వితరణ ఉంటుందని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



మహిళ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో గొల్ల శాంతమ్మ అనే మహిళ చనిపోవడంతో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వారి కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ చందమాల సురేష్ తెలిపారు. ఈ మేరకు నగదును ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు



యాగశాలలో ప్రతిష్ఠించిన దేవతా విగ్రహాలు

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పునఃనిర్మాణం చేపట్టిన లక్ష్మీచెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయ ధ్వజ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా ఆదివారం పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. ఉదయం 8 గంటలకు గో పూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్వీకరవరణం, పంచగవ్యప్రాసనం, దేవతా కలుష స్థాపన, నవగ్రహ కలుష స్థాపన, యంత్రాలకు అభిషేకం చేశారు. యంత్ర పుష్పం, వాస్తు మంటపారాధన, తీర్థ ప్రసాద వినియోగము, సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాల పూజ, మృత్సంగ్రహణము, అంకురారోపణము, దీక్షా హోమము, మంగళ హారతి ఇచ్చారు. వేద స్వస్తి విశేషాది పూజలతో మొదటి రోజు కార్యక్రమాలను పూర్తి చేశారు.

28న ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి దేవన్న

పగిడ్యాల: మాదిగ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 28న ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంలో కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి దేవన్న తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బీరవోలు ఎస్సీ కాలనీలో ఎంఆర్‌పీఎస్ విస్తృత స్థాయి సమావేశ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మాదిగల ఐక్యతతో సంఘటితమై ఏబీసీడీ రిజర్వేషన్‌లను సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు వెంకటేశ్వర్లు, పెద్దన్న, తిరుపాలు, నాగశేషులు, రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

వెలుగోడు: తొగట వీర క్షత్రియ దేవాలయ అభివృద్ధి నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చౌడేశ్వరి దేవి దేవాలయంలో ఆదివారం ఆ సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా నీలం వెంకటరామయ్య, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా పోతుగంటి ఎల్లా శేషయ్య, ప్రధాన కార్యదర్శి బందా సుబ్రహ్మణ్యం, కోశాధికారి నూలు వెంకటయ్య, గౌరవ సలహాదారుగా యదాటి రవీంద్రుడు, గౌరవ అధ్యక్షుడిగా పుట్టేపు వెంకటరమణయ్య, పుట్టేపు సుబ్బారాయుడు, ఉపాధ్యక్షులుగా 8 మంది, కార్యదర్శులుగా 7 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

తర్తూరు.. ప్రగతి పరుగు

- 72 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శరవేగంగా అభివృద్ధి పనులు
- రూ.43.50లక్షలతో సచివాలయం, రూ.24.5లక్షలతో ఆర్బీకే నిర్మాణం
- గ్రామంలో ఇంటింటికీ కుళాయి, సిమెంటురోడ్లు, డ్రైనేజీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



గ్రామంలో నిర్మించిన సచివాలయం



రైతుభరోసా కేంద్రం



జూపాడుబంగ్లా: గ్రామాల్లో అభివృద్ధి లేదంటూ టీడీపీ నాయకులు తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నా ప్రజలు వారి మాటలను విశ్వసించే పరిస్థితుల్లో లేరు. ఇందుకు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులే కారణం. మండలంలోని తర్తూరు గ్రామపంచాయతీ 72 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. గ్రామంలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2కోట్లతో అభివృద్ధి పనులు

1952 డిసెంబర్ 11న గ్రామపంచాయతీగా ఆవిర్భవించిన తర్తూరు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. జగనన్న ప్రభుత్వ హయాంలో చరిత్రలో ఎన్నడూలేని విధంగా గ్రామంలో రూ.2కోట్ల నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలోని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ఊరు దాటకుండా ఊళ్లోనే అందించేందుకు రూ.24.50లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాలంటే ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ గ్రామస్తులు ప్రదక్షిణలు చేయకుండా రూ.43.50లక్షలతో సచివాలయం నిర్మించి ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారు.

ఇంటింటికీ కుళాయి..

గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు రూ.45లక్షలతో జలజీవన్ పథకం కింద నూతన తాగునీటి ట్యాంకును నిర్మించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నారు. రూ.20లక్షల గడప గడప నిధులు, రూ.11 లక్షల మండల పరిషత్ నిధులలతో బీసీ,మైనార్టీ, ఎస్సీ కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారు సేకరించిన చెత్తను గ్రామానికి దూరంగా వేసేలా రూ.5.30లక్షలతో డంప్‌యార్డు నిర్మించారు. రూ.13లక్షలతో దళితవాడల్లో సిమెంటు రోడ్లు నిర్మించారు. రూ.4లక్షలతో జెండాపేటలో శిథిలమైన జీఎల్ఆర్ ట్యాంకును నిర్మించి కాలనీవాసులకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానం ఈఓ ధర్మారెడ్డి సహకారంతో గ్రామంలోని దళితవాడలో రూ.10లక్షలతో కన్రెమ్మ నూతన గుడిని నిర్మించారు.

పాఠశాల మరమ్మతుకు రూ.1.80లక్షలు

గ్రామంలోని దళితవాడలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో రూ.1.80లక్షల గ్రామపంచాయతీ నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించడంతో పాటు టాయ్‌లెట్లు నిర్మించారు. ప్రస్తుతం పాఠశాల రెండో విడత నాడు–నేడు పథకం కింద ఎంపికకావడంతో నూతన పాఠశాల తరగతి గదుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లు మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తుండటం గమనార్హం.

గ్రామానికి అందిన సంక్షేమ లబ్ధి..

అమ్మఒడి పథకం కింద 201 మందికి లబ్ధి, జగనన్న విద్యాదీవెన కింద 134, జగనన్న వసతిదీవెన 100, వైఎస్సార్ రైతు భరోసా 407, ఉచిత పంటల బీమా 308, వైఎస్సార్ పంటల సున్నా వడ్డీ 130, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ 105, పెన్షన్ కానుక 337, వైఎస్సార్ ఆసరా 272 మంది ఇలా గ్రామానికి చెందిన 3,497మంది లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద వారి బ్యాంకు ఖాతాల్లో రూ.10,40,25,557ల నగదు జమచేశారు. అలాగే 1,125మంది లబ్ధిదారులకు కింద రూ. 2,71,63,513 పరోక్ష ప్రయోజనం కలిగింది. మొత్తంగా నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో గ్రామానికి రూ.13,11,89,070ల నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు.

గ్రామ వివరాలు	
గ్రామం పేరు:	తర్తూరు
గ్రామవిస్తీర్ణం :	250ఎకరాలు
గ్రామంలో జనాభా :	2007
స్త్రీలు: 984	పురుషులు: 1,023
ఓటర్ల సంఖ్య :	1,627మంది
స్త్రీలు: 8155	పురుషులు: 811



గ్రామంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

ఇలాంటి అభివృద్ధి ఎప్పుడూ జరగలేదు



మా గ్రామంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక జరిగిన అభివృద్ధి ఎప్పుడూ జరగలేదు. చాలా ఏళ్ల నుంచి రోడ్లకు నోచుకోని కాలనీల్లో సిమెంటు రోడ్లు వేశారు. డ్రైనేజీలు నిర్మించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చేశారు. ప్రభుత్వ పథకాలు ఊరుదాటకుండా ఊళ్లోని సచివాలయం ద్వారా వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి అందేలా చేస్తున్నారు.

– పక్కీరయ్య, తర్తూరు

వీధుల్లో సిమెంటు రోడ్లు వేశారు



మా ఊళ్లో నడవటానికి వీల్లేకుండా ఉంటే కాలనీల్లో సిమెంటు రోడ్లు వేసి, డ్రైనేజీలు నిర్మించారు. మా కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా శిథిలమైన జీఎల్ఆర్ ట్యాంకు స్థానంలో కొత్త ట్యాంకు నిర్మించడంతో నీటి సమస్య తీరింది. అలాగే కొత్తగా ట్యాంకు కట్టించి నీటి సమస్యలేకుండా చేశారు.

– సరస్వతి, తర్తూరు

రూ.2కోట్లతో అభివృద్ధి పనులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామంలో రూ.2కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, సచివాలయాలు, ఆర్బీకే, ఓవర్ హెడ్‌ట్యాంకు, జీఎల్ఆర్ ట్యాంకులను నిర్మించాం. గ్రామంలో రెండు, మూడు సందుల్లో మినహా అన్ని కాలనీల్లో సిమెంటు రోడ్లు నిర్మించాం. అలాగే తాగునీటి సమస్యలేకుండా చేయగలిగాం.

– పెద్దముంతల నాగిరెడ్డి, సర్పంచ్, తర్తూరు

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



నీటిపైపులైన్ వేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా సర్పంచు షేక్ నాజియా ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రికి రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు రహంతుల్లా పనులు చేయించారు. మండలంలోని జడ్డువారి పల్లె గ్రామంలో విద్యుత్ శాఖవారు కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో నీటి పైపులైన్ పగిలిపోయింది. స్పందించిన సర్పంచు రాత్రికిరాత్రే కొత్త పైపులైన్ వేయించారు. అదేవిధంగా ఎదురుపాడు గ్రామంలో బోరుబావిలో నీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో కొత్త మోటారు, పైపులు వేయించి నీటి సమస్య తలెత్తకుండా చేశారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం

గ్రామాలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తామని విద్యుత్ శాఖ ఆత్మకూరు రూరల్ ఏఈ అబీద్ తెలిపారు. ఆదివారం జెడ్డువారి పల్లె, ఎదురుపాడు గ్రామాలలో లైన్‌మెన్లు నాగేశ్వరరెడ్డి, దయానందరెడ్డిల ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. జడ్డువారిపల్లె, ఎదురుపాడు గ్రామాలలో పాత స్తంభాల స్థానంలో కొత్తవి, ఎక్కువదూరం ఉన్నచోట కొత్తవాటిని ఏర్పాటు చేశారు. జడ్డువారి పల్లె గ్రామంలో 15, ఎదురుపాడు గ్రామంలో 25 స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఏఈ తెలిపారు.

డాక్టర్ ఆర్ట్ శ్రీనివాసులుకు సన్మానం

నందికొట్కూరు: శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారతాల పౌర్ణమి సందర్భంగా ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న ఆర్ట్ శ్రీనివాసులును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చింత రామకృష్ణ మాట్లాడుతూ చిత్రలేఖనంలో చిన్న పిల్లలకు శిక్షణ ఇచ్చి 300లకు పైగా గోల్డ్, సిల్వర్ మోడల్స్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రావడానికి కృషి చేశారన్నారు. సామాజిక సేవలో 25 ఏళ్ల నుంచి పాలుపంచుకుని ఆర్ట్, సోషల్ సర్వీస్ చేయడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. చిత్రలేఖనంలో డాక్టరేట్ పొందడం నందికొట్కూరు పట్టణానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి నాగరాజు, నాయకులు కృష్ణ, శ్రీరాములు, జయరాముడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మతిస్థిమితం లేని వ్యక్తి



గోరయ్యను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని అతని కుటుంబానికి అప్పగించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం, తాండూరు మండలం, అచ్చుతాపురం గ్రామానికి చెందిన గోరయ్య అనే వ్యక్తి మతిస్థిమితం లేక ఎనిమిది రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. అక్కడి నుంచి సోమశిల చేరుకొని కృష్ణానది ఇవతలి వైపున సంగమేశ్వరానికి వచ్చాడు. శనివారం రాత్రి మండలంలోని ఎర్రమఠం గ్రామంలో తిరిగుతుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసు సిబ్బందిని అక్కడికి పంపి అతన్ని స్టేషన్‌కు తీసుకొచ్చి, వివరాలు తెలుసుకున్నామని ఎస్ తెలిపారు. ఆదివారం అతని భార్యను పిలిపించి అప్పగించామని వివరించారు.

మహానందిలో వసతి గదులు ఫుల్



మహానందిలోని రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొనడంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలు నిండిపోయాయి. దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న టీటీడీ, నాగనంది సముదాయాల్లో ఉన్న గదులు నిండిపోవడంతో భక్తులు ప్రైవేటు వసతి గృహాల వైపు వెళ్లాల్సి వచ్చింది. కొందరు లాడ్జీల నిర్వాహకులు పోలీసుల నిబంధనలు పట్టించుకోకుండా అధిక మొత్తంలో వసూలు చేసినట్లు విజయవాడ, గుంటూరు ప్రాంతాల భక్తులు వాపోయారు. లాడ్జీల వద్ద గదుల ధరల బోర్డులు ఏర్పాటు చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

నీటిని సాగుకు వినియోగించుకోవద్దు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని కుందూ, కేసీ కాలువల్లో ప్రవహించే నీటిని పంటల సాగుకు వినియోగించుకోవద్దని వీఆర్‌ఓలు ఏసుపాదం, నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు బండిఆత్మకూరు మండలంలోని పరమటూరు, భోజనం గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నీటి కొరత, వర్షాభావం పరిస్థితుల దృష్ట్యా కేవలం తాగునీటి కోసం నీటిని వదిలారన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నీటిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తారన్నారు.

ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



ప్రాణదాన ట్రస్ట్‌కు ఈఓ డి.పెద్దిరాజుకు విరాళ డీడీని అందిస్తున్న దాత మధు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తులు, స్థానికుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రాణదాన ట్రస్ట్‌కు చెన్నైకు చెందిన మధు కోనేరు రూ.1,00,001 విరాళాన్ని అందించారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు విరాళ చెక్కును అందజేశారు. దాతను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

అతివేగం ప్రాణాంతకం

పాములపాడు: వాహన చోదకులు అతివేగంగా వాహనాలు నడపటం ప్రాణాంతకమని ఎస్ఐ అశోక్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం నేషనల్‌హైవే నిర్మాణ పనులు జరుగుతున్నందున వాహన చోదకులు మరింత జాగ్రత్త వహించాలన్నారు. ఆటో వాలాలు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. రహదారి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుడు సుగులూరు భాస్కర్ (50) శనివారం మృతి చెందాడు. శుక్రవారం ఉదయం గుండెపోటుతో కుప్పకూలిన మున్సిపల్ కార్మికుడిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భార్య మల్లమ్మ రోధించిన తీరు పలువురిని కలచివేసింది. కౌన్సిలర్లు లాలు, నాయబ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు జబ్బార్, ఆర్టీసీ బాబు, ఆర్ట్ శ్రీను, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పరమేష్, రామకృష్ణ, రమణ,మున్సిపల్ ఉద్యోగులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు.

నేడు దివ్యాంగుల మహాధర్నా

నందికొట్కూరు: పట్టణంలో సోమవారం జరిగే దివ్యాంగుల మహాధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి నాగన్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని దివ్యాంగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న దివ్యాంగుల హక్కుల సాధన కోసం తలపెట్టిన మహాధర్నాకు వికలాంగులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి శేషమ్మ, సభ్యులు సరస్వతి, షేక్షావలి, నాగరాజు, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రస్తా ఏర్పాటు చేయండి

కొత్తపల్లి: నాగంపల్లి గ్రామంలో నలుదిక్కుల రస్తాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నాగేషన్న, రాజు, రామాంజనేయులు, శేఖర్, నాగరాజు, వెంకటనారాయణ, నాగన్న, పుష్పలత కోరారు. మండలంలోని కొక్కెరంచ గ్రామపంచాయతీ పరిధిలోని మజరా గ్రామమని, ఈ గ్రామం 1980లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో నీటిముంపుకు గురైందని తెలిపారు. అప్పుడు గ్రామపెద్దలు, అధికారులు మాగ్రామాన్ని మోడల్ విలేజ్‌గా చేసేందుకు లేఅవుట్ ప్లానింగ్ చేశారని చెప్పారు. గ్రామంలో ఇంటి స్థలాలు ఇచ్చి నాలుగువైపుల రస్తాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటిదాకా రోడ్లు వేయక పోవడంతో కొందరు వ్యక్తులు రస్తాలను ఆక్రమించుకొని ఇంటినిర్మాణాలు చేసుకుంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకొని రస్తాలు ఏర్పాటు చేయాలని కోరారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దానమయ్య నిల్వ ఉంచుకున్న సుమారు పది ఎకరాల పశుగ్రాసం అగ్నికి ఆహుతవ్వడంతో బాధిత పాడిరైతు దానమయ్య, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిల్వ ఉంచుకున్నామని చెప్పారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తుల ఆలయానికి చేరుకుని శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు స్థానిక కాశినాయన అన్నప్రసాద ఆశ్రమం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు. కొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు.

27 నుంచి ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ వేడుకలు



ప్రతిష్ఠ మహోత్సవానికి సిద్ధమవుతున్న గాలిగోపురం

మిడుతూరు: శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఈ 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 27న ఉదయం 6.30 గంటలకు గోపూజ, గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రదోషపూజనం, అంకురార్పణం, జలాధివాసం తదితర విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న ఉదయం, సాయత్రం పూజలు, హోమాలు ఉంటాయన్నారు. 29న ఉదయం 8.30 గంటలకు ప్రాతఃకాల పూజనం, యంత్రములకు, శిఖరములకు, ధ్వజ దేవతలకు పంచామృత అభిషేకములు, ప్రాతఃదీక్షా హోమం, ప్రతిష్ఠా హోమం, 10.40 గంటలకు మేషలగ్న శుభముహూర్తమున యంత్రప్రతిష్ఠ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న 1 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేడుకలలో అత్యధికంగా భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: తెలుగు దేశం పార్టీ తప్పుడు ప్రచారం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. బోయరేవుల గ్రామంలో 500 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు వచ్చిన కథనాలను తీవ్రంగా ఖండించారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. బోయరేవుల గ్రామ సర్పంచ్ నాగానంది పెద్దస్వామన్న పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దూరంగా పెట్టారన్నారు. గ్రామంలో మొత్తం ఓట్లు రెండు వేలేనని తెలిపారు. 500 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని.. గతంలో ఆ గ్రామంలో ఆ పార్టీ లేనట్లేనా అని ప్రశ్నించారు. నాగానంది పెద్దస్వామన్న, నడిపి స్వామన్న, రాజశేఖర్‌లతో పాటు మరో 30 కుటుంబాలు మాత్రమే మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారని చెప్పారు. ఎన్నికల సమయంలో నాయకుల వలసలు మామూలే అన్నారు. అలాంటిది వందల కుటుంబాలు పార్టీ వీడినట్లు అనుకూలంగా ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. తాను ఎంపీపీ పదవి కోసం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి డబ్బు ఇచ్చినట్లు తప్పుడు ఆరోపణలు చేశారని లాలం రమేష్ మండిపడ్డారు. నేను ఎమ్మెల్యేకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. మా ఎమ్మెల్యేకు ఇవ్వడం మాత్రమే తెలుసని, నాయకుల వద్ద డబ్బులు తీసుకోవడం తెలియదన్నారు. మాజీ ఎమ్మెల్యే సొంత గ్రామం వేల్పనూరులో రూ.4 కోట్లతో ఆసుపత్రి నిర్మించారని, మండలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. తప్పుడు ప్రచారం మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, డైరెక్టర్ రమణ, మండల కార్యదర్శి కే. రామ్మోహన్, తెలుగు రమణ, షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల బస్సు రోడ్డెక్కేనా?

- ఆర్టీసీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో సర్వీసు రద్దు
- పునరుద్ధరణలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం

ఆత్మకూరు: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లో తెచ్చేందుకు అందరూ సహకరించాలని ప్రకటించే ఆ సంస్థ అధికారులు మాత్రం అందుకు తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. లాభాల్లో నడుస్తున్న కర్నూలు - మాచర్ల బస్సు సర్వీసు పునరుద్ధరణలో జరుగుతున్న జాప్యమే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు.

ప్రయాణికులకు అనుకూలంగా బస్సు సర్వీసు

కర్నూలు, గుంటూరు జిల్లా ప్రయాణికులకు అనుకూలంగా కర్నూలు–మాచర్ల బస్సు సర్వీసు గతంలో ప్రారంభించారు. ఈ బస్ సర్వీస్ మాచర్లలో ఉదయం 6 గంటలకు బయలుదేరి కర్నూలుకు మధ్యాహ్నం 1గంటకు చేరుకుంటుంది. కర్నూలు బస్టాండ్‌లో 1.30 గంటలకు తిరిగి బయలుదేరి సాయంత్రం 7గంటలకు మాచర్లకు చేరుతుంది. మూడేళ్లుగా ఈ బస్ సర్వీస్ ప్రతిరోజూ నడిచేది. కలెక్షన్లు కూడా బాగానే వచ్చేవి. మొదట గుంటూరు జిల్లా ఆర్టీసీ అధికారులు ఈ సర్వీస్‌కు హెయిర్ బస్‌కు కేటాయించారు. అయితే లాభాలు అధికంగా రావడంతో సంవత్సరం తర్వాత మాచర్ల డిపో నుంచి రెగ్యులర్ ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు రీజియన్ ఆర్ఎం కర్నూలు నుంచే బస్ సర్వీసు నడుపుతామంటూ గుంటూరు జిల్లా అధికారులకు తెలిపారు. దీంతో వారు ఈ బస్ సర్వీసును రద్దు చేశారు. అయితే ఇంతవరకూ కర్నూలు జిల్లా నుంచి బస్సును ప్రారంభించలేదు.

ఆర్ఎం హామీ ఇచ్చినా..

కర్నూలు–మాచర్ల బస్సు పునరుద్ధరించాలని మాచర్లకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు వ్యాపారులు, గుంటూరు ఆర్ఎంను ఆశ్రయించారు. ఈ విషయంపై కర్నూలు జిల్లా ఆర్ఎంను కలవాలని తెలపడంతో వారు సమస్యను కర్నూలు రీజియన్ ఆర్ఎం శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే బస్సును నడుపుతామని ఆయన హామీ ఇచ్చి మరిచిపోయారు. కొందరు ప్రయాణికులు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, సీఎం, ఇతర అధికారులకు ఫ్యాక్స్ ద్వారా బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు. 25 రోజులుగా బస్ సర్వీసు లేకపోవడంతో మాచర్ల బస్‌కు వెళ్లే ఆత్మకూరు, దోర్నాల, కుంట, మాచర్ల వెళ్లే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఆత్మకూరు, దోర్నాల, కుంట, మాచర్లకు చెందిన ప్రజలకు ఇక్కడ ఎన్నో సంబంధాలున్నాయి. వాణిజ్య, వ్యాపార సంబంధాలు, బంధుత్వాలు ఉన్నాయి. కర్నూలు నుంచి మాచర్లకు బస్ సర్వీస్‌ను నడిపితే ప్రయాణికులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. అధిక కలెక్షన్లతో నడుస్తున్న బస్ సర్వీస్‌ను తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– హనుమంతరెడ్డి, ఆత్మకూరు

ప్రతిపాదనలు అందలేదు

మాచర్ల, గుంటూరు బస్సు సర్వీసులు ఇటీవల రద్దు అయినట్లు మాకు ఎలాంటి సమాచారం అందలేదు. గతంలో గుంటూరు ఆర్ఎం ఆధ్వర్యంలో బస్సు సర్వీసులు నడిపారు. అనివార్య కారణాల వల్ల బస్సు సర్వీసు నిలిచి పోయింది. మాచర్ల లేదా ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే బస్సు వేసే విషయం పరిశీలిస్తాం.

–శ్రీనివాసరావు, కర్నూలు ఆర్ఎం